


6 నుంచి స.హ చట్టం వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం

సమాచార హక్కు చట్టం అమలు లోకి వచ్చి ఈ నెల 12వ తేదీకి 18ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 6 నుండి 12 వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా సమాచార హక్కు చట్టం నోడల్ అధికారి, డిఆర్ఓ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార హక్కు చట్టం పై అవగాహన కలిగించడానికి సృజనాత్మక కార్యక్రమాలు, వర్క్ షాప్‌లు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ప్రభుత్వ పాఠశాలలలో , కళాశాలల్లో , యూనివర్సిటీలలో విద్యార్థులకు చైతన్యం చేసేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు కూడా వారి కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం నోటీసు బోర్డు లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి నెలా 3వ శుక్రవారం సమాచార హక్కు చట్టం దినంగా పరిగణించి దరఖాస్తులను, అప్పీళ్ళ ను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తగ్గుతున్న వ్యవసాయం

జిల్లాలో పదేళ్లలో క్రమంగా వ్యవసాయ పంటలు తగ్గుతున్నాయి. ఒకప్పటి పచ్చని పంట పొలాలు బీడువారుతున్నాయి. చాలాచోట్ల రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. సాగునీటి వనరులు లేకపోవడం, వర్షాలు కూడా అనుకూలించక పోవడం, పెట్టుబడులు భారీగా పెరగడంతో పాటు పంటకు గిట్టుబాటు ధర, మార్కెట్ సదుపాయం వంటివి లేవు. ఈ నేపథ్యంలో చిన్నసన్నకారు రైతులు వలస కూలీలుగా మారారు. మధ్యతరగతి రైతులు కూడా సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటున్నారు. దీంతో జిల్లాలో ఉన్న కొద్దిపాటి వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. ప్రభుత్వాలు మారుతున్నా రాజకీయంగా జోక్యం చేసుకునే నాధులే లేకపోవడంతో జిల్లా పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి.



నాట్లు పడక బీడుగా వదిలేసిన భూములు

- బీడు వారుతున్న పంట పొలాలు
- ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టులు
- పెరిగిన పెట్టుబడులు
- మార్కెట్ సదుపాయం అంతంత మాత్రమే
- వలసబాట పడుతున్న రైతాంగం

తగ్గిన విస్తీర్ణం

సంవత్సరం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
2023-24	2,74,065
2022-23	4,47,592
ఉమ్మడి జిల్లాలో	
2021-22	4,72,257
2020-21	5,79,437
2019-20	5,82,967
2018-19	5,91,997
2017-18	6,69,245
2016-17	6,92,955
2015-16	6,83,525
2014-15	6,60,882

పెరిగిన వరి సాగు విస్తీర్ణం

సంవత్సరం	సాగు విస్తీర్ణం (హెక్టార్లు)
2022-23	93,643
ఉమ్మడి జిల్లాలో	
2021-22	1,27,872
2020-21	1,18,868
2019-20	1,19,380
2018-19	1,21,499
2017-18	1,22,659
2016-17	1,22,205
2015-16	1,24,275
2014-15	1,18,950

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లా భౌగోళికంగా 16, 34, 750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో వ్యవసాయానికి అనువుగావున్న భూమి 9,25,387.5 ఎకరాల వరకు ఉంది. జిల్లా వ్యాప్తంగా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 3,41,130 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యల్పంగా ఉద్యాన పంటల సాగు కేవలం 1,67,902 ఎకరాల్లో మాత్రమే ఉంది. నాన్ ఫుడ్ క్రాప్ ఏరియా కూడా 23,096 (6శాతం) ఎకరాలుగా నమోదైంది. గతంలో పోలిస్తే ముఖ్యంగా వ్యవసాయ పంటలు క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. 2016-17లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, గోగు తదితర వ్యవసాయ పంటల సాగు 6,92,245 ఎకరాల్లో సాగు కాగా, జిల్లాల పునర్విభజన (2020-21) నాటికి 5,79,437 ఎకరాలకు తగ్గింది. ఈ కాల వ్యవధిలో సుమారు 1,13,558 ఎకరాల మేర సాగు విస్తీర్ణం తగ్గినట్లుగా స్పష్టమౌతోంది. ఈలెక్కన సాగు విస్తీర్ణం కన్నా బీడువారుతున్న సాగుభూమి 2శాతం అధికంగా ఉండడం గమనార్హం. జిల్లాల విభజన అనంతరం (2021-22)లో విజయనగరం జిల్లాలో 4,72,257 ఎకరాల్లో వ్యవసాయ పంటలన్నీ సాగవ్వగా, ఈ ఏడాది కేవలం 2,74,065 ఎకరాల్లో మాత్రమే పంటల సాగు కనిపిస్తోంది. దీన్నిబట్టి గడిచిన మూడేళ్లలో 1,98,192 ఎకరాల మేర సాగువిస్తీర్ణం తగ్గిపోయింది. జిల్లాలో వ్యవసాయ రంగంపై సుమారు 80శాతం జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, సాగునీటి వసతి కల్పించక పోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించకపోవడం, ప్రభుత్వం తరపున బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణాలవల్ల సాగు భూమి తగ్గుతోంది. లక్షా 30వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు పూర్తికాకపోవడం వల్ల లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికీ సుమారు 80వేల ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. తారకరామ తీర్థసాగర్ చేపట్టిన దాదాపు 18ఏళ్ల దాటుతున్నా అతీగతీ లేదు. జంఝావతి ప్రాజెక్టు ప్రారంభించి నాలుగు పదులు దాటినా నేటికీ నాలుగు ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. ఇక మైక్రో ఇరిగేషన్‌కు దాదాపు లక్ష్యం అనేదే లేకుండా పోయింది. దీనికితోడు వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించక పోవడం కూడా సాగుభూమి తగ్గుదలకు మరో కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో, 2016-17 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 4,18,930 ఎకరాల మేర వ్యవసాయ పటల సాగు తగ్గింది. ఫలితంగా వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ.13,056 కోట్ల (40.09శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. జిల్లాలో వలసలు ఏటేటా పెరుగుతున్నాయి.

పెరిగిన వరి సాగు.. దిగుబడి

జిల్లా ఖరీఫ్‌లోనే అత్యధిక పంటలు పండుతాయి. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోనూ, విభజిత జిల్లాలోనూ వరి విస్తీర్ణం, దిగుబడి పరిశీలిస్తే కాస్త పెరిగినట్టుగానే కనిపిస్తోంది. దీన్నిబట్టి గోగు, చెరకు, పత్తి, అపరాల పంటల సాగు ఘననీయంగా తగ్గినట్టు స్పష్టమౌతోంది. 2014-15లో 1,18,950 హెక్టార్లలో సాగవ్వగా 2021-22 నాటికి క్రమంగా 1,27,872 హెక్టార్లకు పెరిగింది. జిల్లా విభజన అనంతరం 2022-23లో 93,643 హెక్టార్లలో సాగవ్వగా 2023-24 ప్రస్తుత ఖరీఫ్‌లో 89,853 హెక్టార్ల వరకు సాగైంది. దిగుబడి కూడా 2014-15లో ఎకరాకు 1,602 కేజీల చొప్పున దిగుబడిరాగా జిల్లాలో 4,70,685 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అయ్యింది. 2021-22లో ఎకరాకు 2,004కేజీల చొప్పున దిగుబడి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 6,32,966 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యింది. విభజన జిల్లాలోనూ గత ఏడాది అత్యధికంగా 2,110 కేజీల చొప్పున దిగుబడి రాగా, జిల్లాలో మొత్తం ఉత్పత్తి 4,63,128 మెట్రిక్ టన్నులుగా నమోదైంది.

పెరిగిన వరి దిగుబడి

సంవత్సరం	కేజీలు (ఎకరాకు)	జిల్లాలో దిగుబడి (మె.టన్నులు)
2022-23	2,110	4,63,128
ఉమ్మడి జిల్లాలో		
2021-22	2,004	6,32,966
2020-21	1,770	5,19,691
2019-20	1,974	5,82,336
2018-19	1,413	4,24,153
2017-18	1,807	5,47,607
2016-17	1,893	5,71,553
2015-16	1,791	5,49,917
2014-15	1,602	4,70,685

క్వారీతో భయం.. భయం

కలెక్టర్‌కు రామచంద్రపేట గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి-భోగాపురం

క్వారీలో ఇష్టానుసారంగా బాంబు పేలుళ్లతో భయాందోళన చెందుతున్నామని రామచంద్ర పేటకు చెందిన అధికార పార్టీ నాయకులు, గ్రామస్తులు, వాలంటీర్లు నేరుగా కలెక్టర్ నాగలక్ష్మికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో క్వారీ అనుమతులు పరిశీలించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే...



క్వారీపై ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు, నాయకులు

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించేందుకు కలెక్టర్ నాగలక్ష్మి రామచంద్రపేట గ్రామానికి శుక్రవారం వచ్చారు. గ్రామానికి ఆనుకుని ఉన్న క్వారీలో పట్టపగలే బాంబు బ్లాస్టింగ్ చేస్తున్నారని, పేలుళ్లకు ఇళ్లు అదురుతున్నాయని కలెక్టర్‌కు గ్రామస్తులు తెలిపారు. రాళ్లు కూడా ఇళ్లపై వచ్చి పడుతున్నట్లు ఆమెకు తెలిపారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ క్వారీకి ఎంతవరకు అనుమతులు ఉన్నాయో పరిశీలించాలని తహశీల్దార్ బంగార్రాజును ఆదేశించారు. తాను కూడా మైనింగ్ అధికారులతో ఈ సమస్యలపై మాట్లాడతానని చెప్పారు. సచివాలయం 90 శాతం నిర్మాణం పూర్తి చేశారని, అయితే ఇదీ క్వారీ పక్కన కావడంతో క్వారీ యాజమాన్యం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుందని వాలంటీర్లు చెప్పారు. అప్పట్లో క్వారీ నిలుపుదల చేయడంతో సచివాలయ నిర్మాణానికి క్వారీ పక్కన స్థలం ఇవ్వడంతో నిర్మించేశారని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. స్టే ఎత్తి వేసేందుకు ప్రయత్నిస్తామని ఆమె అన్నారు. గ్రామంలో రేషన్ సరుకులు రెండు నెలలకు ఒకసారి ఇస్తున్నారని, రేషన్ డిపో ద్వారా సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో ప్రజలంతా ఇబ్బంది పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

టీచర్లపై కలెక్టర్ అసహనం

రక్తహీనత ఉన్న విద్యార్థులకు మాత్రలను ఇంటికి పంపిణీ చేయడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం తర్వాత వారు పాఠశాలలోనే మాత్రలు వేసుకున్న తర్వాత ఎన్‌రోల్‌మెంట్ చేయాలని చెప్పారు. కానీ ఇంటికి మాత్రలు ఇస్తే వారు వేసుకుంటున్నది, లేనిది ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు.

అండర్-19 ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 ఖో ఖో జిల్లా బాలబాలికల జట్లు ఎంపిక పోటీలు స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరి మధ్య పోటీలు నిర్వహించి జట్టుకు 12 మందితో బాల,బాలికలు జట్లు ఎంపిక చేసినట్లు అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ తెలిపారు. క్రీడా కారుల్లో ఉన్న ప్రతిభ ఆధారంగానే జిల్లా జట్లు ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన జిల్లా జట్లు 28 తేదీ నుంచి నంద్యాల జిల్లాలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు పయనమైన ఫుట్‌బాల్ జట్టు

చిత్తూరు జిల్లా మండపల్లిలో ఈనెల 7 నుంచి 9 తేదీ వరకు జరగనున్న అండర్ 19 రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా బాల, బాలికల జట్లు శుక్రవారం పయనమై వెళ్లాయి. వీరికి అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. విజయంతో తిరిగి రావాలని కోరారు.

రాష్ట్ర పోటీలకు వాలీబాల్ జట్లు పయనం

ఈనెల 7 నుంచి కడప జిల్లాలో జరగనున్న అండర్ 17 రాష్ట్ర వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా బాల, బాలికలు జట్లు శుక్రవారం పయనమై వెళ్లాయి. స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకున్న జట్లును ఉద్దేశించి ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్ వి రమణ మాట్లాడుతూ బాగా ఆడి రాష్ట్ర విజేతగా తిరిగి రావాలని కోరారు. బాలుర జట్టుకు కోచ్, మేనేజర్లుగా కెవిఎన్ రాజు, శివున్నాయుడు, బాలికలు జట్టుకు వైకుంఠం, రమణ వ్యాయామ ఉపాధ్యాయులు వ్యవహరించ నున్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కష్ణంరాజు, గురునాయుడు పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలోని దెందేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యశోద, డి.యజ్ఞేశ్వర్.. కడపలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం బి.సునీత, పీడీ కె.క్రిష్ణరాజు అభినందించారు.

వ్యక్తిగత ఆరోగ్య ప్రొఫైల్ కీలకం

మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-గుర్ల

జగనన్న ఆరోగ్య సురక్షలో వ్యక్తుల భవిష్యత్ వైద్య చికిత్సలో ఆరోగ్య ప్రొఫైల్ కీలకం కానుందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గుర్ల మండలం చింతలపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి శుక్రవారం సందర్శించి శిబిరం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కంటివెలుగు కింద ఇద్దరు మహిళలకు కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలంతా ఈ శిబిరాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా పరిష్కరించి నయం చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. జెసి మయూర్ అశోక్ వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ఆర్‌డిఒ అప్పారావు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, డిఎస్‌పి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గరివిడి : ప్రజల ఆరోగ్య రక్షణ కోసం క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. గరివిడి మండలం వెదుళ్లవలసలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. దీర్ఘకాలిక కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులు ఈ సందర్భంగా మంత్రిని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన మెరుగైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, డిఎంహెచ్ఒలను ఆదేశించారు. శిబిరంలో భాగంగా సుమారు 500 మందికి సురక్ష కిట్లను, 98 మందికి కళ్లజోళ్లను మంత్రి, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

బాల్య వివాహాలను అరికట్టడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో, సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బాల్య వివాహాల నిరోధంపై జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాల నిషేద చట్టం-2006 గురించి ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, డిసిపిఒ ఎ.సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. బాల్య వివాహాల నిరోదానికి జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, బాల్య వివాహాల నివారణా బాధ్యత కేవలం స్త్రీ శిశు సంక్షేమ శాఖపైనే కాకుండా, ఇతర శాఖలపైనా ఉందన్నారు. మండల స్థాయి బాల్య వివాహ నిషేధ అధికారులు (సిఎంపిఒ)లు మరింత క్రియాశీలంగా వ్యవహరించాలని కోరారు. తమ పిల్లలకు బాల్య వివాహం చేయబోమన్న హామీ పత్రాన్ని పొదుపు సంఘాల మహిళలనుంచి తీసుకోవాలని డిఆర్‌డిఎ, మెప్మా శాఖలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉండే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఎఎన్ఎంలతోపాటు, సచివాలయ కార్యదర్శులంతా బాల్య వివాహాలను అరికట్టడంపై దృష్టి సారించాలని చెప్పారు. వివాహం చేసే తల్లితండ్రులు, పురోహితులు, ఫొటో గ్రాఫర్లు, కల్యాణ మండపం నిర్వాహకులు తదితర అన్ని రకాల భాగస్వాములపై కేసు పెట్టడంతోపాటు, వివాహంలో పాల్గొన్న బంధువులపైనా బైండోవర్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. వివాహం జరిపే ముందు వారి వయసు ధవీకరణ పత్రాన్ని తీసుకోవాలన్నారు. ప్రతీ వివాహాన్ని తప్పనిసరిగా రిజిష్టర్ చేయాలని, రిజిష్టర్ అయిన పెళ్లిళ్ల వివరాలను వారం వారం తమకు అందజేయాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఆర్‌డిఒలు, పోలీసు అధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రచార గోడ పత్రికలను ఆవిష్కరించారు.

నేడు ఎస్‌టి కమిషన్ చైర్మన్ గ్రీవెన్స్

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు శనివారం జిల్లాలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 10 గంటలకు తన క్యాంపు కార్యాలయం నుంచి జెడ్‌పి అతిధి గృహానికి చేరుకుంటారు. గిరిజనుల సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 వరకు భోజన విరామం. అనంతరం సాయంత్రం 5 గంటల వరకు వినతుల స్వీకరణ ఉంటుంది.

'సీతం' విద్యార్థుల క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కాలేజీ ఇసిఇ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం రామవరం వద్ద గల ఐలైట్ ఎల్ఇడి బల్బుల పరిశ్రమకు తీసుకెళ్లారు. అక్కడ వారికి ఐలైట్ ఎమ్‌డి శ్రీ కళ్యాణ్ చక్రవర్తి లైట్ ఎమిషన్ డయోడ్ ఉపయోగించి ఎల్ఇడి బల్బుల తయారీ విధానం, బల్బుల అమరిక, విద్యుత్ కనెక్షన్ ఇచ్చే విధానం, వివిధ రకాల రెక్టిఫయర్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సెన్సార్లు ఎల్ఇడి బల్బుల తయారీలో ఏవిధంగా ఉపయోగపడతాయో వివరించారు. కార్యక్రమంలో సహాయాచార్యులు కె. వెంకటేశ్వర రావు, జెఎస్ శైలజ పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురంలో ఎగువ దళితవీధికి చెందిన రైతు చీపురు సాంబ (55) పాము కాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ సురేంద్ర నాయుడు కథనం ప్రకారం.. చీపురు సాంబ శుక్రవారం చింతలవాని పొలంలో పత్తి చేనుకు పురుగు మందు స్ప్రేచేస్తుండగా పాము కాటు వేసింది. విష సర్పం కావడంతో వెంటనే నోటినుంచి నురగలు కక్కుతూ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని కౌలురైతు మృత్యువాత

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పెంట బ్రిడ్జి సమీపంలో రైలు ఢీకొని కౌలురైతు జి.తిరుపతి(36) మృతి చెందాడు. పెంట గ్రామానికి చెందిన తిరుపతి ఎం.బూర్జవలస సమీపంలో భూమిని కౌలుకు తీసుకుని, సాగు చేస్తున్నాడు. వరి పంటను చూసేందుకు వచ్చిన తిరుపతి ఇంటికి వెళ్తూ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. కుటుంబ పెద్దదిక్కు మరణించడంతో తల్లిదండ్రులు, భార్య, పిల్లలు బోరున విలపిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు

వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి అధినేత చంద్రబాబును పక్కా ఆధారాలతో సిఐడి అధికారులు అరెస్టు చేశారని వైసిపి ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి తేల్చిచెప్పారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో శుక్రవారం 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంపై నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్టన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అవినీతి చేశారని, టిడిపి ఖాతాకు రూ.27 కోట్లు జమయ్యాయని ఆరోపించారు. న్యాయస్థానంలో చంద్రబాబుకు తప్పనిసరిగా శిక్ష పడుతుందని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి సచివాలయం వద్ద సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు జాబితాను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రచారం చేయాలన్నారు. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పారాది వంతెనను గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో చేసిన పనులను చెప్పగలరా? అని రాజులను ప్రశ్నించారు. విభేదాలు, సమస్యలను పక్కన పెట్టి వైసిపి గెలుపు కోసం పని చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మాట్లాడుతూ రాజులకు మద్దతుగా బ్రోకర్ బ్యాచ్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. మెట్టవలసలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి, ఫ్లెక్సీ చించివేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. టిడిపి నేత బేబినాయన చౌకబారు ఆరోపణలు అన్యాయమని, పారాది వంతెనను రాజకీయంగా వాడుకోవడం సరికాదని హితవుపలికారు. పారాది, సీతానగరం వంతెనలకు నిధులు మంజూరు చేయకున్నా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. నూతన వంతెన పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మాజీ సభ్యులు తూముల భాస్కరరావు, నియోజకవర్గ పరిశీలకులు రాజేశ్వరరావు, బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎంపిపిలు శంబంగి లక్ష్మి, భోగి గౌరి, చొక్కాపు లక్ష్మణరావు, నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్లు విస్సు, టి.దామోదర్, ఎం.శంకరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

విశ్వబ్రాహ్మణుల సమస్యలపై వినతి

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని పిసిసి సభ్యులు ముమ్వల శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు ముగడ వెంకటరమణ.. వైవి సుబ్బారెడ్డి, మజ్జి శ్రీనివాసరావుకు వినతులు అందజేశారు. 50 ఏళ్లు దాటిన విశ్వబ్రాహ్మణులకు పింఛను, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

పారాది వంతెన పరిశీలన

బొబ్బిలిరూరల్ : పారాది వంతెనను వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరిశీలించారు. వైసిపి విస్తృత స్థాయి సమావేశానికి బొబ్బిలి వస్తున్న సందర్భంగా వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెన సమస్యపై సిఎం జగన్మోహన్ రెడ్డితో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తామని సుబ్బారెడ్డి తెలిపారు. పాత వంతెన బాగు చేసి నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.


బిజెపి తీరుపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీని కించపరుస్తూ బిజెపి నాయకులు సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లు పెట్టడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సుంకరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై బిజెపి నాయకులు రావణాసురుడుగా చిత్రీకరించి పోస్టర్ రిలీజ్ చేయడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్, స్టేట్ ట్రైనింగ్ సెల్ చైర్మన్ డోల శ్రీ నివాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు షరీఫ్, సూరి అప్పడు, కరీమ్, మబ్బులు, అప్పారావు, చిలకా రాజు , సూరి బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముమ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యాన పట్టణంలో నిరసన చేపట్టారు. ప్రధాని మోడీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎన్ని అబద్ధాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముగడ వెంకటరమణ, డాక్టర్ వెంగల నారాయణరావు, మండల అధ్యక్షులు రాజాన అప్పలనాయుడు, పత్రి రాజు పాల్గొన్నారు.

డెంకాడ : రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మండలంలోని డి.కొల్లాంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌కుమార్, టి.సూరిబాబు, డి.గురువులు, వాకాడ రావణాపురెడ్డి, రాజు పాల్గొన్నారు.



బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

'వైసిపి అక్రమాలకు కొమ్ముకాయొద్దు'

జామి : అలమండలో సర్వే 203/2లో ప్రభుత్వ భూమిలో 200 కొబ్బరి చెట్లు నరికి, ఆ స్థలాన్ని కబ్జాకు పాల్పడిన ఉదంతంపై ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ సునీతకు టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, జనసేన నాయకులు డి.ఈశ్వరరావు, సిపిఎ నాయకులు డి.అప్పలరాజు వినతి పత్రం అందజేశారు. కబ్జా వల్ల తమ పొలాలకు నీరు రావడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన దళితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని వైసిపి నాయకుడు, ఉప సర్పంచ్ లగుడు దేముడు ఆక్రమించి, తన మామిడి తోటకు రోడ్డు వేసుకున్నారని, అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.

వేదికల వారీగా కార్యక్రమాలు

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఈనెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించనున్న విజయనగరం ఉత్సవాల్లో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలకు ఆయా కమిటీలు త్వరగా తుదిరూపు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. ఉత్సవ నిర్వహణలో భాగంగా ఒక్కో వేదికలో నిర్వహించే కార్యక్రమాల సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీలతో కలెక్టర్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ వేదికల్లో ఏర్పాటు చేయాల్సిన క్రీడా, వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీల నిర్వహణ తదితర అంశాలపై ఈ సందర్భంగా జిల్లా అధికారులు, శాశ్వత సభ్యులతో చర్చించారు. గత ఏడాది కార్యక్రమాలు నిర్వహించిన వేదికలతో పాటు ఈ ఏడాది అదనంగా మరికొన్ని వేదికల్లో ఉత్సవాల నిర్వహణకు ప్రతిపాదించారు. శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయానికి ఐదువుగా లేడీస్ క్లబ్‌లో సాహిత్య వేదిక పేరుతో కవిసమ్మేళనం, సాహిత్యగోష్టి వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతిపాదించారు. కోట సమీపంలో బొంకులదిబ్బ వద్ద ప్రఖ్యాత సురభి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించారు. ఆనందగజపతి ఆడిటోరియం మరమ్మత్తులకు గురైన కారణంగా వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టేందుకు సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, శాశ్వత సభ్యులు కాపుగంటి ప్రకాష్, డోల మన్మథకుమార్, బుచ్చిబాబు, మేకా అనంతలక్ష్మి, రాధికారాణి, స్పార్క్ సొసైటీ పద్మనాభం, బాబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్‌చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, ఎస్‌డిసిలు సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, సిపిఒ బాలాజీ, డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఉద్యానశాఖ ఏడి జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

గురువులే జాతి నిర్మాతలు

బొబ్బిలి : ఉపాధ్యాయులే జాతినిర్మాతలని ఆర్‌డిఒ ఏ.శేషశైలజ, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో బొబ్బిలి రోటరీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు 'జాతి నిర్మాతల అవార్డులను' అందజేశారు. జెసి రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో నియోజక వర్గ స్థాయిలో ఎంపిక చేసిన పలువురు ఉపాధ్యాయులను ఆర్‌డిఒ, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ రావు సన్మానించి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కోట్ల శ్రీ హరి, శ్రీనివాసన్, ప్రదీప్, రామకృష్ణ, చక్క శ్రీదేవి, కృష్ణ మోహన్, ఎంఇఒలు త్రినాధ రావు, జి.వాసు, రాజేశ్వరి, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

విజయనగరం టౌన్ : విజయనగరం హెల్పింగ్ హేండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న దసరా నవరాత్రి ఉత్సవాల సంబంధించిన కరపత్రాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించారు. శుక్రవారం తన నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కోలగట్ల మాట్లాడుతూ.. ఏటా నవరాత్రి ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. హిజ్రాస్ అసోసియేషన్ ప్రతినిధి కొండబాబు మాట్లాడుతూ.. నగరంలోని పెద్ద చెరువు గట్టు వద్దనున్న ఆలయంలో ఈ నెల 15 నుంచి 23 వరకూ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

వంతెన పనులు చేపట్టాలి

బొబ్బిలి రూరల్ : పారాది వద్ద వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి డిమాండ్ చేశారు. కుంగిపోయిన పాతవంతెనను శుక్రవారం జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వంతెనకు నిధులు మంజురైనా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. పాతవంతెన బాగు చేసి నూతన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పంటలకు ఇ-క్రాప్.. రైతులకు ఇకెవైసి

రేగిడి : పంటలకు ఇ-క్రాప్ నమోదు చేయడంతోపాటు రైతులకు ఇ-కెవైసి నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి గిరడ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పుర్లి, కొమిరి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించిన ఇకెవైసిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇప్పటికే రైతుల ఇకెవైసి 80 శాతం పూర్తయిందని తెలిపారు. మిగతాది ఐదు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

ఎంఆర్‌పికే ఎరువులు అమ్మాలి

నెల్లిమర్ల : ఎరువులను ఎంఆర్‌పికే అమ్మాలని వ్యవసాయశాఖ ఏడి చంద్రరావు. ఎరువుల దుకాణా దారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలో ఎరువుల షాపుల్లో ఏడి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల షాపుల్లో రికార్డులు, ఎరువుల నిల్వలు, లైసెన్సులు, ఈపోస్ మెషిన్ నిల్వలు, బిల్లు బుక్కులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఒ ఎం.పూర్ణిమ, ఎఇఒ ఎం.నాగరాజు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎడి

డికెర్‌పేట పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని డికెర్‌పేట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పాఠశాల రికార్డులను ఆయన పరిశీలించారు. పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో రమ్య ప్రతిభ

వేపాడ: బక్కునాయుడుపేట వద్దనున్న గురుకుల విద్యార్థిని సిహెచ్ రమ్య.. విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ అండర్-19 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. రమ్యను పిడీ, పిఇటి అదిలక్ష్మి, అరుణ, గురుకుల సిబ్బంది అభినందించారు.

వంతెన నిర్మాణంలో వైసిపి, టిడిపి విఫలం

బొబ్బిలి : పారాది వంతెన నిర్మాణంలో గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు విఫలం చెందాయని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురాతన వంతెన కుంగి పోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు.

బొబ్బిలి వీణను ఏర్పాటు చేయాలి

బొబ్బిలి : పట్టణంలోని అమ్మిగారికోనేరుగట్టు కూడలిలో ప్రపంచంలోనే బొబ్బిలికి గుర్తింపు తెచ్చిన బొబ్బిలి వీణను ఏర్పాటు చేయాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జనసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మిగారి కోనేరుగట్టు ప్రాంతాన్ని సుందరీకరణ చేసి బొబ్బిలివీణను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, మరడాన రవి, మండల నాయకులు లెంక రమేష్, వల్లెం రాజా, చీమల సతీష్, శ్యామ్, రమేష్, మోతి దాసు పాల్గొన్నారు.

గోవధపై ఫిర్యాదు

విజయనగరం టౌన్ : కలెక్టరేట్ దగ్గర జరుగుతున్న గోవధపై మేనకా గాంధీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం చిన్నవల్లి వారి వీధిలోని జిల్లా గో సంరక్షణ సమైక్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్ వద్ద ప్రతిరోజు ఆవులను, దూడలను, ఎద్దులను చంపి కంటైనర్ల ద్వారా ఒడిశాకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని, ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని... దీనిపై పీపుల్ ఫర్ యానిమల్ జాతీయ అధ్యక్షులు మేనకా గాంధీకి ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

ఆరోగ్య పరిరక్షణమే లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


కొత్తవలస.. స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


డెంకాడ.. మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆరోగ్య పరిరక్షణమే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. శుక్రవారం రాజీవ్ నగర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 8, 9, 10, 33, 34 నెంబర్ల సచివాలయాల పరిధిలో ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. శుక్రవారం 800 మంది ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరాలను సందర్శించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య శిబిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార వివరాలను వెల్లడించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు జాకీర్ హుస్సేన్, దుప్పాడ సునీత, పొంతపల్లి మాలతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జులు కోలగట్ల కష్ణారావు, బంగారు నాయుడు, రెడ్డి గురుమూర్తి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి పాల్గొన్నారు.

ప్రజలే ప్రభుత్వానికి అండ

ప్రజలే ప్రభుత్వానికి అండ అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని పలు డివిజన్లకు సంబంధించిన క్లస్టర్ స్థాయి సమావేశం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. కోలగట్ల మాట్లాడుతూ.. ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి అంశంపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు, జోనల్ ఇన్చార్జిలు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

డెంకాడ : ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. మండలంలో గుణుపూర్‌పేట గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు, ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, జెడ్‌పిటిసి బి.లక్ష్మి, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, సర్పంచులు పైల ముత్యాలరావు, అట్టాడ శివకృష్ణ, కోరాడ కనకరాజు, మహంతి సత్యం, నాయకులు బడకొండ రామనాయుడు, బి.రమణ, పైడిరాజు, శ్రీను, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకుంటున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని కుమిలిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచి మామిడి అప్పయ్యమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. వైద్య శిబిరాలు, స్టాళ్లను ఆయన పరిశీలించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కళ్లద్దాలు అందజేశారు. ఈ శిబిరంలో 871 మందికి వివిధ పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు, ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ గుజ్జు సురేష్ రెడ్డి, వైద్యులు డాక్టర్ రాజ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస : కాటకపల్లి సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఆరోగ్య భరోసా కల్పించడానికి ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, వైస్ ఎంపిపి మేలాస్త్రి అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి బొంతల వెంకట్రావు, సర్పంచులు పీతల కృష్ణ, భూసాల దేవుడు పాల్గొన్నారు.

మెంటాడ : మండలంలో బడేవలస గ్రామంలో సర్పంచ్ మీసాల పార్వతి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి విజయ, ఎంపిడిఒ త్రివిక్రమరావు, వైసిపి అధ్యక్షులు రాయపల్లి రామారావు, లెంక రత్నాకర్ నాయుడు, సచివాలయ కన్వీనర్ కనిమెరక త్రినాథ్, కొంపంగి సర్పంచ్ రమణ, వైద్యాధికారులు షేక్ జిలాన్ భాష, లోకప్రియ ,పద్మావతి, మూర్తి పాల్గొన్నారు

వేపాడ : ఆతవ గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, డిటి సన్యాసినాయుడు, పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి, ఆంజనేయులు, కార్యదర్శి నానిబాబు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని గ్రామ సచివాలయం-2 పరిధిలోని, చింతబడి పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంపూర్ణ పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. వైద్యులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, వార్డు మెంబర్ శేఖర్, వంశీ, మాజీ సర్పంచ్ కె.వెంకటరావు, నాయకులు గంగరాజు, బోజంకి గోవింద్, ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఇఒ కన్నబాబు పాల్గొన్నారు.

జెఎస్ శిబిరాన్ని సందర్శించిన సిఎం ఒఎస్‌డి


ముఖ్యమంత్రి ఒఎస్‌డితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

భోగాపురం : మండలంలోని రామచంద్రపేటలో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఒఎస్‌డి ఆర్.ముత్యాలరాజు పరిశీలించారు. అక్కడ వేర్వేగా ఏర్పాటు చేసిన స్టాళ్లకి వెళ్లి ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారు, వారికి ఏమేమి మందులు ఇస్తున్నారో పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు ముందుగా సర్వే చేసి యాప్‌లో అప్లోడ్ చేసింది, లేనిది అడిగి తెలుసుకున్నారు. ఆయన పరిశీలిస్తున్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీయరాదని అధికారులతోపాటు వ్యక్తిగత సిబ్బంది మీడియాను, ఇతరులను కూడా అడ్డుకున్నారు. చివరికి నాయకులను, కింది స్థాయి సిబ్బందిని కూడా ఆయన సమీపానికి వెళ్లకుండా అడ్డుకోవడం విశేషం. ఆయన వెంట కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దార్ చింతాడ బంగార్రాజు, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి సురేష్, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అన్యాయం

మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు


శృంగవరపుకోటలో జైలు రూపంలో ఉన్న శిబిరంలో దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును వైసిపి ప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేసిందని మాజీమంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న సత్యమేవ దీక్షల్లో పతివాడ, జన సేన నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పతివాడ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా చంద్రబాబును అరెస్టు చేసిందన్నారు. పసలేని కేసులు పెట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లోకం మాధవి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, నాయకులు పతివాడ తమ్మునాయుడు, గేదెల రాజారావు, పతివాడ అప్పలనారాయణ, పోతల రాజప్పన్న, లెంక అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : చంద్రబాబు అరెస్ట్ అన్యాయమంటూ భోగాపురంలో టిడిపి నాయకులు ఇంటింటికి కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. టిడిపి గ్రామ అధ్యక్షులు బొడ్డ హరిబాబు, సీనియర్ నాయకులు సంగం అప్పలసూరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. శుక్రవారం చేపట్టిన దీక్షలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, ఎపి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామ్మూర్తి, నాయకులు రాంబార్కి శరత్, సుంకరి సాయిరమేష్ పాల్గొన్నారు.

ఎస్.కోటలో వినూత్నంగా..

శృంగవరపుకోట : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పట్టణంలోని ఆకులడిపో వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆధ్వర్యాన వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. జైలును ప్రతిబింబించేలా దీక్షా శిబిరం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. దీక్షా శిబిరంలో వెంకటరమణపేటకు చెందిన నాయకులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట పుణ్యగిరి రోడ్డులో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షలు శుక్రవారం కొనసాగాయి.

చంద్రబాబుకు మద్దతుగా గర్జించిన యువగళం

ప్రజాశక్తి-విజయనగరం కోట

యువతే ఈ రాష్ట్రానికి భవిత అని టిడిపి నాయకులు గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. ఉత్తరాంధ్ర స్థాయిలో వాయిస్ ఆఫ్ యూత్ పేరిట శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం దిశ దశా నిర్ణయించేది యువతనేని, ఈ రోజు యువత మేల్కొని చంద్రబాబుకు జరిగిన అన్యాయాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని అన్నారు. చంద్రబాబు వంటి విజన్ ఉన్న వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ఎంత అవసరమో ప్రతీ ఒక్కరిలో చైతన్యం కల్పించాలని అన్నారు. టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో అక్రమంగా చంద్రబాబును అరెస్ట్ చేసారని, ఈ విషయాన్ని యావత్ రాష్ట్ర ప్రజలు గమనించారని అన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ విజనరీ నాయకుడికి, ప్రిజనరీ నాయకుడికి ఉన్న తేడాను రాష్ట్రంలో ప్రతీ ఒక్కరూ తెలుసుకున్నారని అన్నారు. జనసేన నాయకులు గురాన అయ్యలు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణలు మాట్లాడుతూ ఒక అవివేకుడిని ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలకు అర్థమైందని అన్నారు. జిల్లా న్యాయవిభాగం అధ్యక్షులు ఉపాధ్యాయుల రవిశంకర్, తెలుగు యువత పార్లమెంటరీ అధ్యక్షులు వేమలి చైతన్యబాబు, కార్యదర్శి గొలగాన సురేంద్ర, ఐటిడిపి అధ్యక్షురాలు విమలారాణి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ జనరల్ సెక్రటరీ మాడుగుల భానుప్రకాష్, మద్దిల ప్రవీణ్ మాట్లాడారు.



యువగళంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు గణపతినీడి శ్రీనివాసరావు

కొనసాగుతున్న దీక్షలు

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసన గా శుక్రవారం 24వ రోజుకూడా దీక్షలు కొనసాగాయి. పార్టీ జిల్లా కార్యాలయం అశోక్‌బంగ్లా వద్ద దీక్షలకు అశోక్‌గజపతిరాజు సంఘీభావం తెలిపారు. సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. మరోవైపు నగర వీధుల్లో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ 'బాబుతో నేను' ప్లకార్డును యువత ప్రదర్శించారు.

పంచాయతీ భవనం లేదు..
సమావేశాలు నిర్వహించేది ఎలా?

మండల సర్వసభ్య సమావేశంలో కన్నాం సర్పంచ్ ఆవేదన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్వీర్యం చేశారని, పంచాయతీ భవనం లేకపోవడంతో పాలకవర్గ సమావేశాలు నిర్వహించ లేకపోతున్నామని కన్నాం సర్పంచ్ చుక్క సన్యాసినాయుడు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంజూరైన నిధులు నిలిచిపోయాయని వాపోయారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఎఒ అనురాధ ఇ-క్రాప్ నమోదు గత ఏడాది కంటే తక్కువగా నమోదైందని, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇ-క్రాప్ నమోదులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖపై ఉందని , ఏయే గ్రామాలలో తక్కువగా ఉందో వెంటనే నాలుగు రోజుల్లో సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే.. ఎఒకు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బి.అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఎంపిటిసి సభ్యులు మంత్రి అప్పలనాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ సమల శ్రీనివాసరావు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో పంచాయతీ భవనం గురించి ప్రశ్నిస్తున్న సర్పంచ్ సన్యాసినాయుడు



ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

బకాయిల జీతాలివ్వాలని గ్రీన్‌అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-దత్తిరాజేరు

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలిపారు. తొలుత సిఐటియు జిల్లా కార్యదర్శి వి. లక్ష్మి ఆధ్వర్యంలో దత్తిరాజేరు కూడలి నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన పదివేల రూపాయలు తక్షణమే చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ ,ప్రమాద బీమా తగు సదుపాయాలు కల్పించాలని తమ డిమాండ్ చేశారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్యను కలిసి వినతి అందజేశారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని జిఎస్ఎన్ రాజీవ్‌నగర్లో నివాసముంటున్న వివాహిత సుంకరి పద్మజ(32) ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం వెలుగు చూసింది. కొత్తవలస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - జామి

మండలంలోని తానవరం గ్రామానికి చెందిన తమటపు భార్గవి (21) గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని యువతి తండ్రి సూరినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువతి తిరిగిరాలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసున్నామని ఎస్ఐ వీరబాబు తెలిపారు.


అదృశ్యమైన భార్గవి

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో వైసిపి కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో సువర్ణ పాలన కొనసాగాలంటే తప్పనిసరిగా మళ్లీ వైసిపిని గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, మొయిద శ్రీను, పాండ్రంకి సత్యవతి, జనా సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-తెర్లాం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. మండలంలోని పెరుమాళి సచివాలయ పరిధిలోని పెరుమాళి, టెక్కలివలస గ్రామాల్లో రెండో రోజు శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, అప్పల నరసింహరాజు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మెట్టవలసలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని మెట్టవలసలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. మెట్టవలస కోనేరు వద్ద విగ్రహాన్ని, రాష్ట్రీయ రహదారి దగ్గర పెట్టిన వైసిపి ఫ్లెక్సీని ధ్వంసం చేశారు. విగ్రహాన్ని తోసేయడంతో విగ్రహం చేతులు, కాలు విరిగాయి. ఫ్లెక్సీని చింపివేశారు. శుక్రవారం ఉదయం గుర్తించిన వైస్ ఎంపిపి అరసాడ శంకరరావు, వైసిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.


ధ్వంసమైన వైఎస్ఆర్ విగ్రహం